రక్త సంబంధీకులకన్నా ఎక్కువ


కిట్లు ధరించి పంచాయతీ రిక్షాపై మృతదేహాన్ని శ్మశానానికి తరలిస్తున్న వలంటీర్లు (ఫైల్)

వలంటీర్లకు వందనం

రొంపిచర్ల: ఒక పక్క కరోనా విలయతాండం చేస్తుంది. ఆ విపత్తులో ప్రాణాలు కోల్పోయిన వారికి అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు సొంతవారు, పక్కింటి వారు సైతం తలుపులు వేసుకొని బయపడుతూ బయటకు రాని పరిస్థితులు అవి. అటువంటి భయానక పరిస్థితుల్లో జగనన్నా నియమించిన వలంటీర్లు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా మేమున్నామంటూ ముందుకు వచ్చి మానవత్వం చాటుకున్న సంఘటనలు ఎన్నో.. అటువంటి మానవతా మూర్తులే పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం విప్పర్లపల్లి వలంటీర్లు గాదె నరసింహారెడ్డి, ఇసుకపల్లి మరియబాబు.

2021 సంవత్సరం మే నెల 19వ తేదీన గ్రామంలోని సూరెడ్డి వెంకటేశ్వరరెడ్డి అనే వికలాంగుడు మృతి చెందాడు. వెంకటేశ్వరరెడ్డి అంత్యక్రియలు నిర్వహించేందుకు బంధువులు కాని చుట్టుప్రక్కల వారు కానీ ఎవ్వరూ ముందుకు రాలేదు. వృద్ధులైన తల్లిదండ్రులు కుమారుడి భౌతికకాయం వద్ద విలపించటం మినహా అంతిమ సంస్కారాలు ఎలా చేయాలో దిక్కుతోచని స్థితిలో తీవ్ర మానసిక వేదనకు గురయ్యారు. ఆ పరిస్థితుల్లో మృతుడు వెంకటేశ్వరరెడ్డి గృహం ఉన్న క్లస్టర్ వలంటీర్ నరసింహా రెడ్డి నేనున్నానంటూ మృతుడి తల్లిదండ్రులకు భరోసా కల్పించాడు. సమాచారాన్ని గ్రామ సర్పంచ్ గాదె రామిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లి తాము అంత్యక్రియలు నిర్వహిస్తామని చెప్పడంతో సర్పంచ్ రామిరెడ్డి ఏర్పాట్లు చేశారు. వెంటనే నరసింహారెడ్డి తనతోటి వలంటీర్ ఇసుకపల్లి మరియబాబు సహకారంతో వెంకటేశ్వరరెడ్డి మృతదేహాన్ని ఖననం చేసేందుకు సమాయత్తం అయ్యారు. అంతిమ సంస్కారానికి అవసరమైన సామగ్రితో పాటు వలంటీర్లు ధరించేందుకు కిట్లను సర్పంచ్ రామిరెడ్డి సమకూర్చారు. కిట్లు ధరించిన వలంటీర్లు తమ చేతులతో వెంకటేశ్వరరెడ్డి మృతదేహాన్ని పంచాయతీ రిక్షాపై శ్మశాన వాటికకు తరలించి అంత్యక్రియలు పూర్తి చేశారు.

అండగా నిలబడింది వలంటీర్లే



70 ఏళ్లకు పైబడిన మా వృద్ధదంపతులకు వికలాంగుడైన కొడుకే దిక్కు. చేదోడువాదోడుగా ఉండే కొడుకు చనిపోతే అయోమయంలో పడ్డాం. కరోనా వల్ల పక్కింటి వాళ్లను పలకరించే పరిస్థితి లేదు. బజారుకు వచ్చి ఎవ్వరితో చెప్పుకుందామన్నా మాగోడు ఈ కరోనాలో ఎవరు పట్టించుకుంటారో అర్థంకాని పరిస్థితి. ముగ్గురు కూతుళ్ల వివాహం అయి దూరప్రాంతంలో ఉన్న అత్తవారింటికి వెళ్లారు. వారు వచ్చే అవకాశం లేదు. ఈ పరిస్థితుల్లో ప్రతిరోజూ తలుపు తట్టి యోగక్షేమాలు అడిగే వలంటీరు నరసింహారెడ్డి దేవుడు పంపిన బిడ్డలా వచ్చి మాకు అండగా నిలబడి అంత్యక్రియలు నిర్వహించారు. మా రక్తం పంచుకోక పోయినా వలంటీర్లే మాకు రక్తసంబంధీకులకన్నా ఎక్కువగా అండగా నిలబడ్డారు.

–సూరెడ్డి కొండమ్మ, విప్పర్లపల్లి

జగనన్న అప్పగించిన పని ఏదైనా చేస్తాం



ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వలంటీర్ వ్యవస్థను సృష్టించి మనిషిలో ఉన్న మానవత్వాన్ని చాటుకుంటూ సేవ చేసేందుకు మమ్ముల్ని నియమించారు. ఆయన పేద, బడు గు, బలహీన వర్గాల వారికి, ఆపదల్లో, ఇబ్బందుల్లో ఉన్న వారికి అన్ని రకాలుగా సేవలు చేస్తున్నారు. ఆయన తలపెట్టిన ప్రజా సేవా యజ్ఞంలో మేము కూడా సమిధలమై మావంతు సేవ చేస్తూ జగనన్న ఆశ, ఆశయాలను నేరవేరుస్తాం.

–నరసింహారెడ్డి, వలంటీర్

ఐకమత్యంగా పని చేయమన్నారు



కరోనా సమయంలో అందరూ బయపడుతున్నా సహచర వలంటీర్లు క్లస్టర్‌లో ఉండే వికలాంగుడు చనిపోయాడని, అంత్యక్రియలు నిర్వహించాలని నరసింహారెడ్డి ఫోన్ చేయగానే వెంటనే వెళ్లా. ఈ పరిస్థితుల్లో అంత్యక్రియలు నిర్వహించటం మా బాధ్యతగా భావించి, సర్పంచ్ గాదె రామిరెడ్డి పర్యవేక్షణలో మేము ఇద్దరం కిట్లు ధరించి అంత్యక్రియలు నిర్వహించాం. జగనన్న ఆలోచనతో సృష్టించిన గ్రామ వలంటీర్ పోస్టుకు న్యాయం చేశామని గర్వపడుతున్నా.

–మరియబాబు, వలంటీర్

మంచినీటిని పొదుపుగా వాడుకోవాలి

మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని


మంచినీటి చెరువు పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని

చిలకలూరిపేట: పట్టణ ప్రజలు మంచినీటిని పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని కోరారు. పట్టణ ప్రజలకు మంచినీరు సరఫరా చేసే తాగునీటి చెరువులను శుక్రవారం మున్సిపల్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వేసవి ఎండల తీవ్రత కారణంగా చెరువులోని జలాలు కనీస స్థాయికి చేరుకున్నాయని తెలిపారు. సాగర్ జలాలు విడదల జాప్యం అవుతున్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. కళ్లాపి చల్లడం, పశువులను కడిగేందుకు మంచినీటిని ఉపయోగించరాదని సూచించారు. దుస్తులు ఉతకడం వంటి అవసరాలకు బావినీళ్లు, బోర్‌వెల్ నీళ్లను ఉపయోగించాలని చెప్పారు. సమీప ప్రాంతాలలోని మున్సిపల్ బోర్‌వెల్స్ మరమత్తులు ఉంటే పురపాలక సంఘంలోని ఇంజినీరింగ్ విభాగంలో ఫిర్యాదు చేయాలని తెలిపారు. మంచినీటి చెరువులకు అవసరమైన నీటిని నింపుకొనేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి విడదల రజిని ద్వారా సాగర్ జలాల విడదలకు ప్రత్యేక అనుమతి కోరినట్లు వివరించారు. ఈ నేపథ్యంలో ప్రజలు సైతం బాధ్యతగా భావించి నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, కొమరవల్లిపాడు పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ తోట బ్రహ్మస్వాములు, 15వ ఆర్థిక సంఘం సభ్యుడు వడితే కోట్యానాయక్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, ఏఈఈ సీహెచ్ శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

కంది, చిరుధాన్యాల సాగు పెంచాలి

జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి


రైతులకు విత్తనాలు అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి

వినుకొండ(నూజెండ్ల): రైతులు కంది, చిరుధాన్యాల సాగును పెంచాలని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి తెలిపారు. వినుకొండ రూరల్ మండలంలోని నరగాయపాలెం రైతు భరోసా కేంద్ర పరిధిలోని రైతులకు కంది, చిరుధాన్యాల విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాధికారులు ఆర్‌బీకే సిబ్బందికి, రైతులకు కంది, అపరాల సాగుపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినుకొండ సబ్ డివిజన్ కంది, చిరుధాన్యాల సాగుకు అనుకూలమని తెలిపారు. ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ మాట్లాడుతూ కందిలో సమగ్ర సస్యరక్షణ, సమగ్ర పోషక యాజమాన్యం, సాగు యాజమాన్యపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వినుకొండ ఏడీఏ రవిబాబు,, ఐదు మండలాల ఏవోలు, ఏఈవోలు, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దోమలు వ్యాప్తి పెరగకుండా చూడాలి

మలేరియా జోనల్ అఫీసర్ డాక్టర్ బి.వినోద్‌కుమార్


జాగ్రత్తలు వివరిస్తున్న డాక్టర్ వినోద్‌కుమార్

యడ్లపాడు: దోమల వ్యాప్తితోనే వివిధ ప్రమాదకర వ్యాధులు సంక్రమిస్తాయని మలేరియా జోనల్ అఫీసర్ డాక్టర్ బి వినోద్‌కుమార్ తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయం -2 పరిధిలోని ఎస్సీ కాలనీలో శుక్రవారం పర్యటించారు. స్థానికంగా ఉన్న బావిని, నీటి నిల్వల ప్రాంతాలను పరిశీలించి అధికారులకు అక్కడ చేపట్టాల్సిన జాగ్రత్తల్ని తెలియజేశారు. ఇళ్ల మధ్య మురుగు, నీటి నిల్వలు లేకుండా చూడాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. తరచు అధికారులు కూడా ఆయా అంశాలపై పర్యవేక్షణ చేయాలని చెప్పారు. పలు కుటుంబాలను కలిసి సీజనల్ వ్యాధులు, దోమల వల్ల వచ్చే వ్యాధుల గురించి వివరించారు. అలాగే కాలనీలోని మలేరియా కేసును పరిశీలించి కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. మలేరియా లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర విషయాలను వారి కుటుంబ సభ్యులకు వివరించారు. సిబ్బందిని అప్రమత్తం చేశారు. తగు సలహాలు, సూచన్లు చేశారు. అక్కడి నుంచి యడ్లపాడులోని ప్రాథమిక వైద్యశాలను చేరుకుని ల్యాబ్‌ను, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం రక్తనమూనాల సేకరణ, ఆర్టీటీ, డెంగ్యూ కిట్స్ తదితర వివరాలను స్టాఫ్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గోపీనాయక్, సీహెచ్‌వో పున్నారావు, సూపర్‌వైజర్ వి.రాజశేఖర్, చిలకలూరిపేట మలేరియా సబ్ యూనిట్ కార్యాలయ అధికారి ఆర్‌సీహెచ్ నారాయణ, సూపర్‌వైజర్లు ఎస్‌వీ చలామరెడ్డి, శివయ్య, దిలిప్‌కుమార్, బీఎస్ కోటేశ్వరరావు, ఆరోగ్య, ఆషా వర్కర్లు ఉన్నారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

నాదెండ్ల: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందగా, మరో వ్యక్తి గాయాలపాలైన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం సాయంత్రం సాతులూరు పెట్రోల్ బంకు సమీపంలో కారు ఢీకొట్టడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి బండారి హరికృష్ణ మృతిచెందగా, మరో యువకుడు గాయాలపాలయ్యాడు. కారు పల్టీ కొట్టి రోడ్డు ప్రక్కన పడిపోయింది. దీంతో కారు డ్రైవర్ పరారీలో ఉండగా, పోలీసులు కేసు నమోదు చేశారు. నరసరావుపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న చలంచర్ల ఏసుబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మెరుగైన సేవలు అందించాలి

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామం రైతుభరోసా కేంద్రంలో కారుమంచి, వయ్యకల్లు, గుంటుపాలెం గ్రామ సమాఖ్యా సంఘాలకు సంబంధించి పుస్తకాలు తనిఖీలు చేసినట్లు ఏపీయం జి.వాసుబాబు శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా ఏపీయం మాట్లాడుతూ ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన స్త్రీ నిధి, ఉన్నతి, బ్యాంకు లింకేజీ, సీఐ యూఫ్ ద్వారా తీసుకునే రుణాలు జీవనోపాదుల యూనిట్స్ స్వయంగా పరిశీలించి తగు సూచనలు చేశామన్నారు. గ్రామసమాఖ్య సంఘాల్లో మహిళా సభ్యులు మెరుగైన సేవలు పారదర్శకంగా అందించి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. ఫిర్యాదులకు తావులేకుండా విధులు నిర్వహించాలన్నారు. ఆయనతో పాటు పశువైద్యాధికారి గుణధీర్, సీసీ బేబి రాణి, ఖాజావలీ వీవోఓలు పాల్గొన్నారు.

మహాధర్నా జయప్రదం చేయండి

నరసరావుపేట: ఉపా, ఎన్ఐఏ చట్టాలను రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ శనివారం విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు మహాధర్నాకు చెందిన కరపత్రాలను ఎన్‌జీవో హోమ్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కంబాల ఏడుకొండలు, శిఖనం సాంబయ్య (ప్రగతిశీల కార్మిక సమాఖ్య) సిలార్ (సీఐటీయూ) జక్కా బ్రహ్మయ్య (కులనిర్మూలనా పోరాట సమితి) గోదా జాన్ పాల్, గేరపాటి మోహన్‌రావు (జై భీమ్ భారత్ పార్టీ) కోండ్రు విజయ్, దార్ల యర్రయ్య (మాలమహానాడు), కూచిపూడి రమేష్ (దళిత సంక్షేమ సంఘం) కోటా రాజబాబు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

నరసరావుపేట రూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగే ఈ సమావేశానికి గౌరవ ఎంపీటీసీ సభ్యులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అన్ని శాఖల మండలస్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. ఆయా శాఖలకు చెందిన ప్రగతి నివేదికలతో పాటుగా గత సమావేశంలో శాసనసభ్యులు సూచించిన పనులకు సంబంధించి తీసుకున్న చర్యల నివేదికలతో హాజరు కావాలన్నారు.

జీవో నెం. 36, 90లను అమలు చేయండి

నరసరావుపేట: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు జీవో నెం.36, 90ల ప్రకారం వేతనాలు అమలు చేయాలని ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు పాలిమేర వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక జీడీసీసీ బ్యాంకు కార్యాలయంలో ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఛలో విజయవాడ పోస్టర్‌ల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 17వ తేదీన నిర్వహించ తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రద్రం చేయాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఈవోలు కంటు శ్రీనివాసరావు, నంద్యాల వీరారెడ్డి, మహిపతి రామాంజనేయులు, తోట రాంబాబు, షేక్ రహీం, రమేష్, పచ్చవ భవానీ, తనుబుద్ధి కృష్ణారెడ్డి, ఓరుగంటి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు జీడీసీసీ బ్యాంకు ఆవరణలో శుక్రవారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఛలో విజయవాడ పోస్టర్‌లను ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న ఛలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జగనన్న సురక్షతో నూరుశాతం సంక్షేమం

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు


బ్రాహ్మణపల్లిలో లబ్ధిదారులకు జగనన్న ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా



తుర్లపాడులో జగనన్న సురక్ష సదస్సులో హాజరైన అధికారులు

వినుకొండ(నూజెండ్ల): అర్హులైన ప్రతి ఒక్కరికీ నూరుశాతం సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వినుకొండ రూరల్ మండలం బ్రాహ్మణపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష సభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం గ్రామ సచివాలయాల ద్వారా అందించే 11 రకాల ఉచిత ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్నకు చెబుదాం అనేక కార్యక్రమానికి జగనన్న సురక్ష అనే మరో కార్యక్రమాన్ని జతచేసి ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్నట్లు చెప్పారు. వలంటీర్లు ఇంటింటికీ తిరిగి చిన్నచిన్న సాంకేతిక సమస్యలతో జనన, మరణ, కౌలురైతు, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ నమోదులో సమస్యలు వంటి పత్రాలు అవసరమైన వారిని గుర్తించి గ్రామ సభల్లో ఉచితంగా అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఇప్పటికీ సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి నూరుశాతం సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని విజయవంతం చేయాలన్నారు. అనంతరం బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలో 193 మందికి జగనన్న ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకట రామిరెడ్డి, గ్రామ సర్పంచ్ శారా సరోజిని, ఎంపీటీసీ దారా కనికరం, ఎంపీడీవో మంగాపురనాథ్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, పార్టీ నాయకులు తాతిరెడ్డి, అయ్యపరెడ్డితో అన్ని శాఖ అధికారులు, స్థానిక నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తుర్లపాడులో...

యడ్లపాడు: మండలంలోని తుర్లపాడు గ్రామ సచివాలయం ప్రాంగణంలో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సదస్సులో మండల ప్రత్యేక అధికారి రాధారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మరింత పారదర్శకంగా నిర్వహించి, సత్వర సేవలు అందించే ప్రక్రియలో భాగంగానే జగనన్న సురక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామ వలంటీర్లు ఈ ప్రత్యేక క్యాంపెయిన్‌లో ప్రజల సమస్యల్ని గుర్తించి ఆన్‌లైన్ చేశారన్నారు. అనంతరం వాటి పరిష్కరిస్తూ కుల, ఆదాయ, రేషన్ ఇతరేత్ర కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వై.హనుమారెడ్డి, తహసీల్దార్ ఎన్.నాగమల్లేశ్వర రావు, సర్పంచ్ రావూరి వేణుగోపాలరావు, నాయకులు వి.అంకమ్మరావు, చుండి రమేష్, నాగయ్య, పంచాయతీ కార్యదర్శి ఎం సుబ్బారావు పాల్గొన్నారు.

గొరిజవోలులో 420 ధ్రువపత్రాల పంపిణీ

నాదెండ్ల: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నాలుగేళ్లలో పూర్తి చేసి ఇవ్వని హామీలను కూడా అమలు చేసిన ప్రజల ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు చెప్పారు. మండలంలోని గొరిజవోలు గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం జగన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పరిధిలో 1150 గృహాలకు గాను 900 గృహాలను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సర్వే చేసి 420 ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు ఉచితంగా అందించారు. వ్యవసాయాధికారి హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ ప్రారంభమైనందున ప్రతి రైతు పంట నమోదు ఆర్‌బీకేల్లో తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు జరిగినపుడు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటూ పంట అమ్ముకునేటపుడు ప్రభుత్వ మద్దతు ధరలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్రెపాటి గృహలక్ష్మి, ఎంపీపీ తలతోటి రాణి, ఎంపీటీసీ గారపాటి సుహాసిని, తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, గణపవరం, నాదెండ్ల సొసైటీల చైర్మన్లు మంగు ఏడుకొండలు, కురుగుంట్ల వెంకటరెడ్డి, జగనన్న సురక్ష మండల కన్వీనర్ రవికుమార్, డీటీ అనురాధ, వైఎస్సార్ సీపీ నాయకులు సింగారెడ్డి కోటిరెడ్డి, ఉడతా వెంకటేశ్వరరావు, జెట్టి బొల్లయ్య, బత్తుల సీతారామిరెడ్డి, బసల శివరామకృష్ణ, లూర్దురెడ్డి, చందవరం వెంకటరెడ్డి, పూర్ణయ్య, డీటీ అనురాధ, ఆర్ఐ రమీజా, వీఆర్వో అశోక్, పంచాయతీ కార్యదర్శి అహ్మద్ ఉన్నారు. సర్పంచ్ గొర్రెపాటి గృహలక్ష్మి, ఎంపీటీసీ గారపాటి సుహాసిని, వెంకటరెడ్డి, ఆధ్వర్యంలో గ్రామంలో జగనన్న సురక్ష పథకం అనంతరం లబ్ధిదారులతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి విడదల రజిని చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు.

జగనన్న సురక్ష పేదలకు వరం



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్

ఈపూరు: మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశ్వర్లునాయక్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా సర్టిఫికెట్ల కోసం నిరీక్షించిన లబ్ధిదారులకు ఈ కార్యక్రమం ఒక వరం లాంటిదని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇలాంటి కార్యక్రమం గతంలో ఎప్పుడూ జరగలేదని అన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బొల్లా బుజ్జి, సర్పంచ్ బయ్యారపు రమ్య రవికుమార్, మండల ప్రత్యేకాధికారి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో మరికొందరికి స్థానం

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. గత ఏడాది 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన రెబ్బా శ్రీనిధి సుష్మ, పిడెం ప్రత్యూషలు ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి అర్హత సాధించారు. హెచ్‌ఎం డీఎం. సుభాని మాట్లాడుతూ పాఠశాల్లో చదివిన విద్యార్థులు ట్రిపుల్ ఐటీ లో సీట్లు సాధించటం అభినందనీయమన్నారు. విద్యాబోధన చేసి విద్యార్థులను మంచిగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను అభినందించారు. సీట్లు పొందిన విద్యార్థులను అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, శేషిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామచంద్ర, సైదయ్య, సునీత, ఆదిలక్ష్మీ, శోభారాని, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

ఈపూరు : ట్రిపుల్ ఐటీలో ఈపూరు విద్యార్థినీ మేడికొండ గ్రేస్‌కు సీటు లభించింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం 10వ తరగతిలో 560 మార్కులతో ప్రథమస్థానం సాధించింది. ట్రిపుల్ ఐటీకి దరఖాస్తు చేసుకోగా జనరల్ సెలక్షన్స్‌లో ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సీటు లభించింది. ఈ నెల 24వ తేదీన ఆర్కే వ్యాలి క్యాంపస్ ఇడుపులపాయలో క్యాంపస్ ఇంటర్వ్యూ జరగనుంది. ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన గ్రేస్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ సూరబోయిన అంకుల్ అభినందనలు తెలిపారు.

చట్ట వ్యతిరేకతకు పాల్పడవద్దు: డీఎస్పీ


మాట్లాడుతున్న నరసరావుపేట డీఎస్పీ మహేష్

వినుకొండ టౌన్: సమాజంలో చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే దోషులుగా శిక్షించడం జరుగుతుందని నరసరావుపేట డీఎస్పీ మహేష్ హెచ్చరించారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల బొల్లాపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ముందు నిలిపి ఉంచిన హీరో గ్లామర్ ద్విచక్ర వాహనాన్ని దొంగిలించబడిందని రాబడిన సమాచారం మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేయ్యడం జరిగిందన్నారు. దర్యాప్తులో భాగంగా బండ్లమోటు ఎస్ఐ జి. రవికృష్ణ బొల్లాపల్లి మండలంలోని మేళ్ళవాగు జంక్షన్ వద్ద రాబడిన సమాచారం మేరకు నిందితులు దిరిశాల నరసింహా రెడ్డి, మిరియాల వెంకటేష్‌లను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి 10 ద్విచక్ర వాహనాలు స్వాధీనపరుచుకుని, కేసు నమోదు చేశామన్నారు. సమావేశంలో రూరల్ సీఐ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

శావల్యాపురం: శుక్రవారం స్థానిక పోలీసు స్టేషను ఆకస్మికంగా సందర్శించారు. దిశ యాప్ నమోదులో జిల్లాలో నరసరావుపేట డివిజన్ ప్రథమ స్థానంలో ఉందని ఆయన వివరించారు.

క్లుప్తంగా

17 నుంచి ఉచిత యోగ శిక్షణ శిబిరం

నరసరావుపేట ఈస్ట్: శ్రీవెంకటేశ్వర యోగ సేవాకేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో ఈనెల 17వతేదీ సోమవారం నుంచి 171వ ఉచిత యోగ శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు యోగాచార్యులు కూనిశెట్టి వెంకట జనార్ధన్ గురూజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలోని శ్రీవేంకటేశ్వర కళ్యాణ మండపంలో ప్రతిరోజు ఉదయం 5గంటల నుంచి 7గంటల వరకు యోగ శిక్షణ ఉంటుందన్నారు. శిబిరంలో 42 యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం, ఆహార నియమాలు, సూర్య నమస్కారాలు బోధిస్తామని తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో ఒత్తిడిని జయించేందుకు, శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఉపయోగపడుతుందని వివరించారు. వివరాలకు 9490846333, 9491665733 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

మహిళపై దాడి

నరసరావుపేట టౌన్: స్వల్ప వివాద నేపథ్యంలో మహిళపై దంపతులు దాడికి పాల్పడిన సంఘటన శుక్రవారం పట్టణంలో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దచెరువు ఇందిరాగాంధీ బొమ్మ సెంటర్ వద్ద నివాసం ఉంటున్న పామర్తి రాజారాజేశ్వరిపై అదే ప్రాంతానికి చెందిన షేక్ జానీ భాష అతని భార్య గౌసియ రాయితో దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరేంద్రబాబు తెలిపారు.

సురక్షిత నీరు అందివ్వండి

వినుకొండ(నూజెండ్ల): పట్టణానికి తాగునీరు అందించే సింగరచెరువును ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు సురక్షితమైన తాగునీరు సరఫరా చేయాలనే ధృఢసంకల్పంతోనే ముందుకు వెళ్తున్నామని తెలిపారు. గతంలో కేవలం 72 ఎకరాల చెరువు ఉందని, మా ప్రభుత్వంలో చెరువును 270 ఎకరాలుగా విస్తీర్ణం చేశామని గుర్తుచేశారు. గతంలోని ఫిల్టర్ బెడ్‌లను తొలగించి కొత్తగా మరమ్మతులు చేసి ప్రజలకు పరిశుభ్రమైన సురక్షిత నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ఇంటింటికి కుళాయి ద్వారా ప్రతి ఇంటికి పైపులైన్ ద్వారా నీటి సరఫరా చేసేందుకు పనులు పూర్తిస్థాయిలో ముగింపు దశలో ఉందని గుర్తు చేశారు. ఇలాంటి అనేక మంచి పనులు చేస్తుంటే ప్రతిపక్ష నాయకులు బురద చల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు ఉన్నారు.

నూతన పనులు గుర్తింపు

బొల్లాపల్లి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నూతన పనులు గుర్తించినట్లు ఏపీవో ఎస్. ఆంజనేయరాజు తెలిపారు. పనులను గుర్తించి ప్రతిపాదనలు పంపామన్నారు. వీటిలో ప్రధానంగా నీటి సంరక్షణకు ప్రాధాన్యత చేకూర్చే పనులు ఈ పథకంలో ప్రవేశపెట్టామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలకు సంబంధించి వర్షపు నీటిని భూమిలోకి ఇంకిపజేసేందుకు నేలబావుల మరమ్మతు పనులు, చుట్టూ ప్రహరీ ఉన్న శ్మశాన వాటికలో మొక్కలు నాటడం, రోడ్డుకు ఇరువైపులా ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటడం, మైనర్, మేజర్ కాలువలపై మొక్కలు నాటడం వంటి పనులను గుర్తించి ప్రతిపాదనలు తయారు చేసి పంపామని త్వరలో మంజూరు అవుతాయని ఏపీవో తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీ పథకంలో పనులు జరుగుతున్నాయన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

చిలకలూరిపేటటౌన్: యువకుడు కనిపించటం లేదని అర్బన్‌పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన కుందూరి మున్నా అనే యువకుడు టైలరింగ్ పని చేస్తుంటాడు. ఇంట్లో తన కోసం ఎవరూ వెతకవద్దు అంటూ లేఖ రాసి గురువారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయాడు. యువకుడి తండ్రి కుందూరి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశ్రాంత ఉద్యోగుల దాతృత్వం



వినుకొండ టౌన్: తమ సేవా సంఘం ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ, విశ్రాంత ఉద్యోగులు తమ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. ఇప్పటికే పలు సేవా కార్యక్రమాల ద్వారా పలువురికి చేయూత నిచ్చినవారు, వినుకొండ రూరల్ పెదకంచర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవసరమైన నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర వస్తువులను శుక్రవారం అందచేశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు భువనగిరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దాతలు అందిస్తున్న సహకారంతో చక్కగా చదువుకొని విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వై.వి. సుబ్బయ్య శర్మ, జి. నాగేంద్రుడు, ఎం.వి.శర్మ, వి.రామలింగేశ్వరరావు, టి. శేషయ్య, సంజీవరావు, ప్రసాదు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.